భూగర్భ జలాలు కనుమరుగు

- వేసవిలో పొంచి ఉన్న నీటి ఎద్దడి ముప్పు
- బోర్లు, బావులు అడుగంటే ప్రమాదం
- ఆక్రమణలతో కుచించుకుపోతున్న చెరువులు



చింతలపూడి మండలంలో ఎండిపోయి బీడువారిన ఆంధ్రా కాలువ



మండలంలో నీరు తగ్గిపోయిన మేడవరపు చెరువు

చింతలపూడి: నియోజకవర్గంలో ఈ వేసవిలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉంది. చెరువులు ఖాళీ అవుతున్నాయి. బోర్లు, బావులు అడుగంటిపోయే ప్రమాదం ఏర్పడింది. నియోజకవర్గంలో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే ఆంధ్రా కాలు ఎండిపోయింది. ఈ పరిస్థితుల్లో మెట్ట ప్రాంత ప్రజానీకం త్రాగునీటికి, సాగునీటికి తహతహలాడే పరిస్థితి వచ్చేలా ఉంది. నియోజకవర్గంలో 450 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. వీటి కింద 50 వేల ఎకరాలకు పైగా పలు రకాల పంటలు సాగు చేస్తున్నారు. మిగిలిన వ్యవసాయం బోర్ల కింద సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా మే వచ్చే సరికి చెరువుల్లో నీరు ఇంకిపోతుంది. ఈ ఏడాది మాత్రం చాలా చోట్ల రబీలో వరి వ్యవసాయం చేపట్టడంతో ఫిబ్రవరి, మార్చిలోనే చెరువులు ఖాళీ అయ్యే ప్రమాదం ఏర్పడింది. గత ఏడాది నవంబర్ నుంచి వర్షాలు పడకపోవడం ఒక కారణమైతే, రైతులు దాళ్వా పంటలు వేయడం కూడ మరో కారణంగా చెబుతున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నీరు చెట్టు పథకంలో భాగంగా పూడిక తీత పేరుతో లక్షలాది రూపాయలు దుర్వినియోగం చేశారే కాని చెరువులు మాత్రం బాగు పడలేదు. వీటికి తోడు చెరువుల ఆక్రమణల కారణంగా నీరు నిల్వ చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. అధికార యంత్రాంగం ఏమీ పట్టనట్టు చోద్యం చూస్తుండటంతో దశాబ్ధాల కాలంగా ఆక్రమణలతో చెరువులు హరించుకుపోతున్నాయి. ఫలితంగా ఏటా వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడుతుంది. చెరువుల్లో నీరు తగ్గిపోతే పశువులకు తాగునీరు ఎలా అన్నదే ప్రస్తుతం రైతులను పట్టి పీడిస్తున్న సమస్య. మెట్టకు శాశ్వత సాగునీటి వసతి లేకపోవడం, కేవలం వర్షాలపైనే ఆధారపడ్డ చెరువుల వల్ల ప్రతి ఏటా మనకు ఈ దుస్థితి ఏర్పడుతుందని ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు.

పూడిక తీయాలి



నియోజకవర్గంలోని చెరువులు పూడికతో నిండిపోయాయి. పూడిక తీయడానికి వచ్చే వేసవిలో చర్యలు తీసుకోవాలి. ఉపాధి హామీ నిధులతో చెరువుల పూడికను పూర్తి స్థాయిలో తీయిస్తే చెరువుల్లో వర్షపు నీరు నిల్వ చేసుకోవచ్చు.

–బొడ్డు వెంకటేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్, చింతలపూడి

ఆక్రమణలను తొలగించాలి



చెరువులు ఆక్రమణలతో కుంచించుకుపోయాయి. చెరువుల్లోనే సాగు చేస్తున్నారు. అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి ఆక్రమణలను తొలగించాలి. దీంతో పాటు పూడికతో నిండిపోయిన చెరువులను గుర్తించి పూడిక తీయించాలి.

–గిరి భోగారావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు, రాఘవాపురం

వైఎస్సార్‌సీపీ నేత రాజబాబు ఆరోగ్యం విషమం



రాజబాబు

ద్వారకాతిరుమల: మండలంలోని సీహెచ్ పోతేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చెలికాని రాజమోహన్‌రావు(రాజబాబు) ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ఇటీవల బాత్‌రూమ్‌లో కాలుజారి పడిపోవడంతో ఆయన ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. కొద్ది రోజుల పాటు లక్ష్మీపురంలోని విర్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. అయితే శస్త్ర చికిత్స తప్పనిసరని వైద్యులు సూచించడంతో ఆయన హైదరాబాద్‌లోని సిటీ న్యూరో ఆస్పత్రిలో చేరారు. రెండు రోజుల క్రితం అక్కడి వైద్యులు కాలికి శస్త్ర చికిత్స చేశారు. అయితే బుధవారం ఉదయం పదకొండున్నర గంటల సమయంలో ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆరోగ్య పరిస్థితి విషమించింది. ప్రస్తుతం వెంటిలేటర్ సహాయంతో వైద్యం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతలపూడి: సీతానగరం సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నిమిత్తం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ, తాగునీటి సర్వీసులకు అర్ధ రాత్రి 12 నుంచి మూడు గంటల వరకు మాత్రమే విద్యుత్ సప్లై ఉంటుందని జంగారెడ్డిగూడెం ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ బుధవారం తెలిపారు. చింతపల్లి, సీతానగరం, ఊట సముద్రం, ఎర్రగుంటపల్లి ఫీడర్స్ పరిధిలో మూడు గంటల చొప్పున త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఇస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా రాఘవాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు నిర్వహణ పనుల నిమిత్తం గురువారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

పాఠశాలలో సామాజిక తనిఖీ

కొయ్యలగూడెం: మండలంలోని గవరవరం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. రీసోర్స్ పర్సన్ కె.వెంకటరాజు పాఠశాలలో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పథకం నిర్వహణపై సూచనలు, సలహాలు అందజేశారు. పాఠశాల మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నరసింహునికి ఉయ్యాల సమర్పణ



ఆలయ ఆవరణలో ఉయ్యాలను ఆలయ ప్రధానార్చకులకు అందజేస్తున్న దాత

ద్వారకాతిరుమల: మండలంలోని ఐఎస్ జగన్నాథపురం సుందరగిరిపై కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి ఒక భక్తురాలు బుధవారం ఉయ్యాలను సమర్పించారు. ఏలూరుకు చెందిన పూల శ్రీను, ప్రసన్న దంపతుల కుమార్తె సాయిలక్ష్మి ముందుగా తన భర్త హేమంత్‌రెడ్డితో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం సుమారు రూ.30 వేలు విలువైన ఈ ఉయ్యాలను ఆలయ ప్రధానార్చకులు కోడూరి ఈశ్వర్‌కుమార్ శర్మకు అందించారు. ఉయ్యాలను స్వామివారి పవళింపు సేవకు వినియోగించాలని దాత కోరారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మన్మధ రాజా, పసుపులేటి పండు దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయంలో చండీహోమం



నూకాలమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయంలో చండీహోమం వైభవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా, వేదోక్తంగా 72వ చండీహోమం నిర్వహించినట్లు చెప్పారు. నామ ఉమామహేశ్వరరావు, పద్మావతి అలివేలు మంగమ్మ దేవీ కుమారి దంపతులు, రావి రాఘవకుమార్, భవాని దంపతులు, పామర్తి వెంకట పద్మావతి దంపతులు, పారేపల్లి మణి కుమార్, నవ్యశ్రీ దంపతులు, ముల్లంగి ప్రసాదరెడ్డి,సంధ్య చండీహోమంలో ఉభయదారులుగా వ్యవహరించినట్లు తెలిపారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయి గూడెం అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారికి నిత్య కైంకర్యాలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఐసీడీఎస్ కార్యకర్తలకు శిక్షణ

బుట్టాయగూడెం: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌బీ పఢాయిబీ శిక్షణ నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ ఇ.తులసి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ్‌బీ పడాయిబీ కార్యక్రమంలో పిల్లల్లో పౌష్టికాహార లోపం, మధ్యస్థ, తీవ్రమైన పోషకాహార లోపం, సూక్ష్మ పోషక లోపాలపై శిక్షణ ఇచ్చామన్నారు.

రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

బుట్టాయగూడెం: మండలంలోని గణపవరంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ బి.ముత్యాలరావు మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేయుటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు పొందాలంటే ఈ విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి అని సూచించారు.

వరదల నాటికి తరలించేలా చర్యలు

బుట్టాయగూడెం: ముంపు గ్రామాల్లో తరలించాల్సిన నిర్వాసితులను జూన్ నాటికి తరలించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఐటీడీఏ పీఓ కేతావత్ రాములు నాయక్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 41.15 పరిధిలో ముంపునకు గురవుతున్న వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ఆర్అండ్ఆర్ కింద నిర్వాసితులకు నిధులను జమ చేశామన్నారు. పునరావాస గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, నిర్మాణాలకు సంబంధించి టెండర్లు పిలించారు. త్వరలోనే టెండర్లు పూర్తి చేసి పనులు పూర్తి చేసేలా కృషి చేస్తామని చెప్పారు.

వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం



విజయదుర్గమ్మ గ్రామోత్సవంలో పాల్గొన్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: విజయ దుర్గ అమ్మవారి దేవాలయంలో ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామమోహనరావు అధ్యక్షతన పల్లకీ సేవ నిర్వహించారు. పౌర్ణమి తిథిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాల చార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విజయదుర్గ అమ్మవారికి సన్నాయి మేళ తాళాల నడుమ అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ మహిళా కమిటీ సభ్యులు లలితా సహస్ర పారాయణం చేశారు. ఆలయమునకు విచ్చేసిన భక్తులకు దివాకర్ స్వీట్స్ షాప్ యజమాని వారి ఆర్థిక సహాయంతో ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో రామిశెట్టి శ్రీనివాసరావు, మారిసెట్టి అంజన్‌కుమార్, రాజ పురోహిత్ అశోక్ సింగ్, కర్పూరం తుకారం, జల్లిపల్లి శివకృష్ణ, మారిశెట్టి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న రోటరీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా పెనుమర్తి సురేష్‌బాబు, కార్యదర్శిగా ఆయన సతీమణి సంధ్యా ప్రవల్లికను రోటరీ సభ్యులు ఎంపిక చేశారని రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ దాకారపు కృష్ణ ప్రకటించారు. రోటరీ అధ్యక్షుడు ఊడా రాంగోపాల్ (గోపీ) అధ్యక్షతన, కార్యదర్శి భవిరిశెట్టి హనుమాన్ తిలక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దాకారపు కృష్ణ మాట్లాడుతూ నూతన కార్యవర్గం 2025 జులై ఒకటి నుంచి 2026 జూన్ 30 వరకు బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మల్లాది సీతారామారావు, చామర్తి శ్రీరాములు, పాలపర్తి శ్రీనివాస్, గణిత ఆనంద ప్రసాద్, కేఎల్ఎన్ ధనకుమార్, కొమ్ముకూరి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

కౌలు రైతులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కౌలు రైతులు

చింతలపూడి: కౌలు రైతులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రుణాలు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొంత కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కౌలు రైతు సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సోమశేఖర్ మాట్లాడుతూ గ్రామ సభలు నిర్వహించి భూ యజమాని ప్రమేయం లేకుండానే వాస్తవ సాగుదారులను గుర్తించి వారికి కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద తక్షణమే రూ.20 వేల పెట్టుబడి సాయం అందించాలని కోరారు. ధర్నాలో కంచర్ల గురవయ్య, ఎస్‌కే కాలేషా, చీకటి సత్యనారాయణ, తక్కెలపాటి ప్రసాదరావు, తాడిగడప మాణిక్యాలరావు, పెనుమత్స రామకృష్ణంరాజు, చక్రపు బసవయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక భరోసా



టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్లు అందుకున్న మహిళలు

కామవరపుకోట: కుట్టు శిక్షణ మహిళలకు ఆర్థిక భరోసాను కలగజేస్తుందని తపన ఫౌండేషన్ సభ్యుడు బాలరాజు అన్నారు. కామవరపుకోట శివారు కొత్తపేటలో గత 90 రోజులుగా తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ నేర్చుకున్న 50 మంది మహిళలకు ధ్రువీకరణ పత్రాలను బుధవారం అందజేశారు. తపన ఫౌండేషన్ ద్వారా ఏలూరు జిల్లా వ్యాప్తంగా అనేక మండలాల్లో కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. తపన ఫౌండేషన్ సభ్యులు గణేష్, నాగబాబు, సోషల్ వర్కర్ వీరమల్ల మధు, శిక్షకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న రవాణా శాఖ అధికారి ఎస్.రంగనాయకులు

పోలవరం రూరల్: వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, రవాణా శాఖాధికారి ఎస్.రంగనాయకులు అన్నారు. పోలవరం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్‌లకు భద్రతపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో రవాణా శాఖ అధికారి మాట్లాడుతూ పరిమితికి మించి పాసింజర్లను ఎక్కించరాదని తెలిపారు. ప్రమాదాలకు తావు లేకుండా భద్రతా నియమాలను పాటించాలన్నారు. మహా శివరాత్రి ఉత్సవాల సమయంలో ఎక్కడా ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా ఆటో డ్రైవర్లు వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఉప రవాణా శాఖ అధికారి వై.సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

దివ్య ప్రబంధ అధ్యయనోత్సవాలు ప్రారంభం



పారిజాతగిరిలో దివ్యప్రబంధ అధ్యయనోత్సవాలు నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో బుధవారం నుంచి మూడు రోజులు దివ్య ప్రబంధ అధ్యయనోత్సవాలు నిర్వహిస్తున్నామని కార్యనిర్వహణ అధికారి మాణికల రాంబాబు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం నమ్మాల్వార్ అనుగ్రహించిన తిరువాయమోజీ ప్రబంధం సేవా కాలం పారాయణ నిర్వహిస్తారని, శుక్రవారం సాయంత్రం నమ్మాల్వార్ పరమపదోత్సవంతో అధ్యయనోత్సవాలు పూర్తి అవుతాయని తెలిపారు. ద్వారకాతిరుమలకు చెందిన నల్లాన్ చక్రవర్తుల పార్థసారథి ఆచార్యులు ఈ పారాయణలో పాల్గొంటున్నారని కార్య నిర్వహణ అధికారి తెలిపారు.

గిరిజన చట్టాలను అమలు చేయాలి



పోలవరంలో నిరసనప్రదర్శన నిర్వహిస్తున్న గిరిజన సంఘం నాయకులు

పోలవరం రూరల్: 1/70, పీసా అటవీ హక్కుల చట్టం 2005 పటిష్టంగా అమలు చేయాలని రైతు కూలీ, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన ప్రదర్శనలు చేశారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు 1/70 చట్టాన్ని సవరిస్తానని వ్యాఖ్యానించడాన్ని ఖండించారు. ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా గిరిజన సంక్షేమ చట్టాలను పాలకులు అమలు చేయడం లేదన్నారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ భాష మాట్లాడుతూ మూడో సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం అడవులను, కొండలను, ఖనిజ సంపదలను కార్పోరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు అప్పగించడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టాన్ని సవరిస్తామని వ్యాఖ్యానించడం దుర్మార్గమన్నారు. తాము అధికారంలోకి వస్తే జీవో నంబర్ మూడును పునరుద్ధరిస్తామని చెప్పిన టీడీపీ ప్రభుత్వం ఇంత వరకు దాని ఊసే ఎత్తలేదన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం భాస్కర్, సవలం రాంబాబు, బొరగం భూచంద్రరావు, దాడి రాములు, మడకం పోశమ్మ, తామ బాలరాజు, ఎస్.సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా వీరభద్రస్వామి కల్యాణం



గ్రామోత్సవంలో భద్రకాళి సమేత శ్రీవీరభద్ర స్వామి

కామవరపుకోట: స్థానిక కోటలో కొలువైన భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి కల్యాణం బుధవారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో ధ్వజారోహణం నిర్వహించి వేదమంత్రోచరణల నడుమ అర్చకులు భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఉత్సవమూర్తులను పల్లకీలో తీసుకొచ్చి మండపంలో అందంగా అలంకరించారు. తెల్లవారు జామున మూడు గంటల నుంచి స్వస్తిశ్రీ చంద్రమాన శ్రీక్రోధినామ సంవత్సర మాఘ శుద్ధ పౌర్ణమి రోజు శైవాగమ శాస్త్ర ప్రకారం వేద పండితుల ఆశీర్వచనాలతో మంగళ వాయిద్యాలతో అంగరంగ వైభవంగా స్వామి వారి కల్యాణం నిర్వహించారు. శివాలయాల్లో రాత్రి సమయంలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. అందుకు భిన్నంగా తెల్లవారు జామున సూర్యోదయానికి ముందే స్వామి వారి కల్యాణం వెన్నెలలో నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సుమారు 15 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు అన్నదాన కమిటీ సభ్యులు తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

కామవరపుకోట: అనధికారికంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. మండలంలో బుధవారం సాగిపాడు గ్రామంలో తన సిబ్బందితో దాడులు నిర్వహించగా పరసా గంగాధర్‌రావు వద్ద నుంచి 180 మిల్లీ లీటర్ల పరిణామం గల ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని బెల్ట్ షాప్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో చింతలపూడి ఎక్సైజ్ ఎస్సై అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నట్లు సీఐ అశోక్ తెలిపారు.

డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



పోలవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద తనిఖీలు చేస్తున్న బృందం సభ్యులు

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందం క్షుణ్ణంగా పరిశీలన జరిపారు. ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు పోలవరం ప్రాజెక్టుతోపాటు, పోలవరంలోని ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేస్తున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్, ఆసుపత్రి ప్రాంతాల్లో బుధవారం బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సభ్యులు తనిఖీలు చేశారు.

మరో శ్రీలంకగా ఆంధ్ర



సమావేశంలో మాట్లాడుతున్న మన్నవ కృష్ణ


కొయ్యలగూడెం: మరో శ్రీలంక వలె ఆంధ్రా తయారవుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య విమర్శించారు. కొయ్యలగూడెంలో మండల శాఖ విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపు విషయంలో అంకెల గారడీగా చేసిందన్నారు. టీవీఎస్ రాజు, దుగ్గిరాల నారాయణరావు పాల్గొన్నారు.

గిరిజన దేవతల జాతర ప్రారంభం



గద్దె రాజులను తీసుకొచ్చేందుకు తీన్మార్ దప్పులతో నృత్యాలు చేస్తున్న భక్తులు





గిరిజన ఆరాధ్య దేవతలు

బుట్టాయగూడెం: గిరిజనుల ఆరాధ్య దేవతలుగా భక్తుల పూజలందుకుంటున్న దుర్గమ్మ, గుబ్బల మంగమ్మ, నాగదేవత, గద్దెరాజుల జాతర మహోత్సవాలను బుధవారం ఎంతో వైభవంగా ప్రారంభించారు. అమ్మవార్లను పూలతో అలంకరించి ఉదయం ఆరు గంటలకే పసుపు, కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే వర్సావారి ఇలవేల్పుగా కొలవబడుతున్న గద్దె రాజులతో పాటు గుబ్బల మంగమ్మ, నాగమ్మ, దుర్గాదేవి అమ్మవార్లకు రాజుపట్నం పోసి గిరిజన సంప్రదాయ డోలు, కొమ్ము నృత్యాలతో గద్దెకు తీసుకొచ్చారు. డోలు కొయ్యల వాయిద్యాలతో కామవరం కొండలు దద్దరిల్లాయి. మండలంతో చుట్టు పక్కల నుంచి భక్తులు భారీగా వచ్చారు. కాగా ఈ జాతర మహోత్సవాలు ఈ నెల 16వ తేది వరకూ నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పీఠాధిపతి వర్సా పుల్లారావు, సృజన, వర్సా రాంబాబు, మొడియం రమేష్, వెట్టి శ్రీను, తెల్లం రమేష్, మడివి కన్నయ్య, కూరం సుజాత, గోగుల గంగమ్మ, పొట్టా మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు ప్రశంస

కొయ్యలగూడెం: మొబైల్ ఫోన్ల రికవరీలో కనబరిచిన నిబద్ధత పట్ల కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ రామాంజేయులు ప్రశంసను అందుకున్నారు. ఏలూరులో మొబైల్ రికవరీ, బాధితులకు మొబైల్ అందజేసే కార్యక్రమంలో భాగంగా ఎస్పీ కేపీఎస్ కిషోర్ రామాంజేయులును అభినందించారు. రామాంజనేయులు విధి నిర్వహణలో చోరీకి గురైన 23 మొబైల్స్‌ను రికవరీ చేశారు. ఈ మొబైల్స్‌ను ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. కానిస్టేబుల్ రామాంజనేయులు మాట్లాడుతూ పోలవరం సీఐ సురేష్‌బాబు పర్యవేక్షణ, కొయ్యలగూడెం ఎస్సై వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తాను మొబైల్స్ రికవరీ చేయగలిగానన్నారు. కాగా, ఎస్పీ కేపీఎస్ కిషోర్ చేతుల మీదుగా రామాంజనేయులు రివార్డును అందుకున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ద్వారకాతిరుమల: పీడీఎఫ్ అభ్యర్థి గెలుపునకు స్థానిక యూటీఎఫ్ భవనంలో బుధవారం ప్రజా సంఘాల సమావేశాన్ని నిర్వహించి, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.లింగరాజు మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థిగా దిడ్ల వీరరాఘవులు బరిలో నిలిచారన్నారు. ప్రజా సమస్యలతో పాటు, చిరుద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే పోరాటాలు చేస్తారన్నారు. వీరరాఘవులు గెలుపు కోసం పట్టభద్రులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సహాధ్యక్షుడు పి.రాంబాబు, కట్టా భాస్కరరావు, నాయకులు పాల్గొన్నారు.